# శృంఖలాలు

రోజులు ఎలాగోలాగ దొర్లి పోతున్నాయి. భూపతి చాలా పొద్దుపోయేక ఇంటికి వస్తాడు. తలుపు మృదువుగా రెండు సార్లు కొడతాడు. భార్య తలుపు తెరవగానే, మాట్లాడకుండా లోపలికి వెడతాడు. బట్టలు మార్చుకుని, కాళ్లూ చేతులూ కడుక్కున్న తరువాత వచ్చి భోజనానికి కూర్చుంటాడు. భోజనం ఎదురుగా వడ్డించి వుంటుంది. అన్నం అనేసి, నిశ్శబ్దంగా వెళ్లి పడక మీద పడుకుంటాడు. ఈ మధ్యలో వినతితో ఒక మాట కూడా మాట్లాడడం అవదు. ఒకే ఇద్దరు మనుషులు పరస్పరం ఎంతో సన్నిహితంగా నివసిస్తున్నారు ఏడు సంవత్సరాలు అవుతోంది. కాని, అది వాళ్లు వ్యవహరించే తీరులో కనిపించదు. వాళ్లిద్దరి మధ్య అంతులేని అగాథం వుంది. రెండు బారల దూరంలో, ఒక పెద్ద పరువు మీద చెరొక వైపు పడుకుని, రాత్రి గడుపుతున్న వాళ్లమధ్య ఎంతో గాఢమైన అనుబంధం వుండాల్సింది. కాని వాళ్లు ఒకరి కొకరు చాలా చాలా దూరంగా జరిగిపోయేరు. వాళ్ల మధ్యవున్న దూరం 'చాలాదూరం' అనేసి ఊరుకుంటే సరిపోదు, సరిగా అర్థంకాదు.

ఉదయం లేచి భూపతి తనే బజారుకి వెడతాడు. బజారు నుంచి వచ్చి, సంచీ వంటింట్లో దింపుతాడు. భోజనం అయిన తరువాత ఆఫీసుకి వెళ్లడానికి తయారవుతాడు.

యాంత్రికంగా వాళ్ల సంసారం సాగిపోతున్నది. బయటినుంచి చూసే వాళ్ళకి ఒడిదుడుకులు కనపడవు. అసహజంగా ఏమి కనిపించదు. అందుచేతనే, ఆ భార్యా భర్తల మధ్యవున్న స్తబ్దత ఇంకా భయంకరం.

అది మామూలుగా, మానాభిమానాల పట్టింపుతో వచ్చే చిన్న చిన్న కలహాల వల్ల వచ్చినది కాదు. అతి పటిష్టమైన వివాహబంధంతో ముడివడ్డ ఆస్త్రీ పురుషుల మధ్యవున్న, అసహజమైన, వింతైన, విముఖ త్వానికి కారణం, వాళ్ల పూర్వ చరిత్ర తెలుసుకున్నా, తెలుస్తుందో లేదో సందేహమే. పైకి కనిపిస్తున్న వాళ్ల జీవితాల వెనక దాగి వున్నదంతా, తెలుస్తుందా?

అతి సామాన్యంగా వాళ్ల వివాహం జరిగింది. ఇంతకంటె మంచి కుర్రవాడిని వెతికి తెచ్చే తాహతు, వినతి తల్లిదండ్రులకి లేకపోయింది. ఇల్లు, వాకిలి, బంధువులు లేక పోయినా, సంపాదన పరుడు, ఆరోగ్యవంతుడు అని, భూపతికి తమ కుమార్తె నిచ్చి పెళ్లి చేసేక, వాళ్లకి నిశ్చింత కలిగింది. వినతికి అత్తవారిల్లంటే, భర్త, అత్తగారూ తప్ప ఇంకెవరూ లేదు. ఆడపడుచులు, తోటికోడళ్లు లేకపోవడం, ఒక విధంగా హాయిగానే వుంటుంది. అయితే, కుర్రవాడే ఎందుకో కొంచెం-

ఆ 'ఎందుకో కొంచెం' అన్నది మాత్రం వాళ్లకి స్పష్టంగా బోధపడలేదు. కొద్దిగా అనుమానం వేసింది. ఈ అనుమానం కలగడం కూడా ఆశ్చర్యమే. నిజానికి, భూపతిని చూసిగాని, అతడితో మాట్లాడిగాని ఏదైనా లోపం ఎంచడానికి అవకాశం లేదు. వినతి తలిదండ్రులకి, అంతరాంతరాల్లో ఏదో అనుమానం కలిగినా, వాళ్లు దాన్ని లక్ష్య పెట్టలేదు. అలా లక్ష్యపెట్టక పోవడమే సహజం.

వినతి అప్పుడు, ఒక పధ్నాలుగు, పదిహేను సంవత్సరాల, అతి అమాయకురాలు, సిగ్గరి అయిన బాలిక, శోభనం నాటి రాత్రి, తన శరీరం కంటె బరువైన ఒక బనారసు పట్టుచీర కట్టుకుని, మంచం చివర, ఒదిగి, ఒక పక్క, మొద్దుబారి పోయినట్టు కూర్చుంది.

అప్పటికే రాత్రి చాలా పొద్దు పోయింది. పెళ్లికి వచ్చిన ఆహ్వానితుల భోజనాల హడావిడి అయిన తరువాత, భూపతి ముందుగానే, గదిలో మంచంమీద, తలకింద చెయ్యి పెట్టుకుని పడుకున్నాడు. బంధువులెవరూ లేకపోవడం చేత, ఇరుగు పొరుగు ముత్తయిదువలే, వినతిని అలంకరించి గదిలోకి పంపేరు.

వినతి గదిలో అడుగు పెట్టగానే, భూపతి ఒక సారి ఇటు తిరిగి ఆమె వేపు చూసేడు. ఆ తరువాత అతడు మంచం మీద నుంచి లేచి, తలుపు దగ్గర చేరి కుతూహలంగా చూస్తూ, హాస్యాలు చేస్తున్న ఆడవాళ్లని లక్ష్య పెట్టకుండా, గట్టిగా చప్పుడు చేస్తూ, తలుపు గడియ వేసి, తిరిగి పడక మీద పడుకున్నాడు.

పరుపు మీద పడుకుంటున్నప్పుడు, అజాగ్రత్తగా కాలు తగిలి కాబోలుపక్కని పెట్టుకునే గుండ్రటి తలగడా కింద పడిపోయింది. కింద పడిపోయిన వస్తువుని తియ్యడం తన కర్తవ్యం అని, వినతి, సహజంగా, అది తీసి పరుపు మీద పెట్టగానే, భూపతి దానిని మళ్లీ కాలితో తన్ని కింద పడేసేడు.

విస్మయంగా, కొంచెం భయంగా, వినతి భర్త వైపు చూసింది. లేదు, భయపడ్డానికేం లేదు. భూపతి నిశ్శబ్దంగా నవ్వుతున్నాడు.

అతడు ఆట పట్టిస్తున్నాడని అర్థం చేసుకుని, ఈసారి వినతి తన నవ్వుని దాచుకోలేకపోయింది. తలమీది ముసుగు సరిగా లాక్కుని, మళ్లీ ఆ తలగడని తీసి మంచం మీద పెట్టబోతూ వుంటే, తిరిగి భూపతి కాలు విసిరేడు. తల గడ కింద పడనే పడింది, ఇంకొంచెం గట్టిగా కాలు విసిరి వుంటే, ఆమె చేతికి దెబ్బ తగిలి వుండును.

వినతి ఈసారి నవ్వలేకపోయింది. కాని, ఆశ్చర్య పోయి తన చేతిని లాగేసుకుంది. వెంటనే భూపతి పగలబడి నవ్వేడు. అతడు మంచం మీద కూర్చుని వున్నాడు.

వినతి కూడా నవ్వింది. కాని తలగడ నేల మీద నుంచి తీసే ప్రయత్నం చెయ్యలేదు. మంచానికి చివరి వైపు, గోడపక్క నిలబడింది. భూపతి ఆమె వేపు చూసి, ఇంకా అలా నవ్వుతూనే, "ఏదీ తలగడ తియ్యలేదేం?" అన్నాడు.

వినతి మూతి ముడిచి, ఒకసారి అతని వేపు కోపంగా చూసి తలదించుకుంది. మునుగులోనుంచి, ఆమె ముఖం కనపడ్డంలేదు.

"తియ్యి, తలగ్గడా" అన్నాడు.

ఆమె కిందకి చూస్తూ, తల అడ్డంగా ఆడించి, తియ్యనని చెప్పింది. వెంటనే కిసుకున నవ్వింది.

భూపతి పరుపుమీదనే! ఆమె వున్న వైపు కొద్దిగా జరిగేడు. "తలగడ తీస్తేగాని వీల్లేదు' ' అన్నాడు, ఆమె చెయ్యి గట్టిగా పట్టుకుని భర్త మొదటిసారి తనని స్పృశించేడు.

వినతి భయంతో ఆనందంతో, సిగ్గుతో కూడిన గగుర్పాటుతో అదోరకంగా అయిపోయింది. కుంచించుకు పోయి, కొద్దిగా దూరంగా జరిగి, అతి నీరసంగా అయిపోయి, తన చేతిని విడిపించుకోడానికి ప్రయత్నించి, విఫలురాలైంది - ఆమె శరీరంలో అంత మాత్రం కూడా శక్తి లేనట్టు-ఆమె శరీరం, అపూర్వమైన ఆనందపు వివశత్వంతో అతి దుర్బలంగా అయిపోయింది.

ఇంతలోనే, "తియ్యి అని చెప్తున్నానా!' అన్నమాటలు ఖంగుమని వినిపించేయి.

వినతి గాభరాపడి, తలెత్తి భర్తవైపు చూడకుండా వుండలేకపోయింది. ఆశ్చర్యం! గొంతు ఎంత కఠినంగా వున్నట్టు వినిపించిందో, ముఖంలో అది కొంచెం కూడా కనిపించ లేదు. భూపతి నవ్వుతున్నాడు.

వినతి కొంచెం ధైర్యంగా, సిగ్గుతో



# బెంగాలీ మూలం: ప్రేమేంద్ర మిత్ర
# శృంఖల
## తెనుగుసేత: ఆర్.వి. లక్ష్మీదేవి

అస్పష్టమైన స్వరంతో, "మళ్లీ తోసెయ్యరు కదా?" అంది.

"ముందు అది తియ్యి" అన్నాడు.


భర్తతో మొదటిసారి పరిచయమైన తీరు.. కొద్దిగా అసహజంగా వున్నట్టు అనిపించినా. వినతికి ఈ జరిగినదంతా కొద్దిగా అస్వభావికమైన హాస్యప్రయత్నంలా కనిపించింది గాని, అంతకంటె ఆమెకి అందులో ఎక్కువ ఏమీ కనిపించలేదు. వుంటేనా

కనిపించడానికి?

ఆమె త్వరగా తలగడ తీసి మంచం మీద పడేసి, మృదువుగా, అయిందికదా?" అంది.

కాని అక్కడితో అది అయిపోలేదు. వినతికి ఇంకోసారి తలగడ తీసి పెట్టవలసి వచ్చింది. ఇలాంటి మోటు హాస్యం ఆమెని చాలా విస్మితురాలిని చేసింది.

అస్వాభావికమైనా, పూర్తిగా అర్థంలేని సంఘటన. వినతికి అది జ్ఞాపకం వుంచవలసిన మాట కాదు, కాని రోజులు గడుస్తున్న కొద్దీ, ఆ మొదటి రాత్రి సంఘటనే వారి భావి జీవితానికి ఒక సూచన అని తెలిసింది.




వాళ్ల కాపురం పెట్టిన దగ్గర నుంచి, చిన్న చిన్న విషయాలలో సహితం, అభిప్రాయ భేదాలతో, ఒక విధమైన విరోధ భావంతో వాళ్లవైవాహిక జీవితం ఆరంభమైంది. అంతగా పట్టించుకోవలసింది బహుశ ఏమీ లేకపోవచ్చు. వినతికి భర్త స్వభావం, ప్రవర్తన అర్థమయిన తరువాత, అతని కనుగుణంగా నడుచుకోడానికే ఆమె ప్రయత్నించేది. కాని, ఆమె మనసులో ఎక్కడో, అకారణమైన భయం, అనుమానం చోటు చేసుకున్నాయి.

ఇరవై సంవత్సరాల క్రితం భర్త చనిపోతే, వినతి అత్తగారు ఈ ఒక్కాగానొక్క కొడుకుని పెంచింది. తండ్రి పోయినప్పుడు, భూపతి వయసు అయిదు సంవత్సరాలు. ఇంకొకరి పంచకింద ఎటువంటి ఆదరాభిమానాలు చవి చూడకుండా, బాధలు పడి, పెరిగి పెద్దవాడయేడు, భూపతి. ఇంకొక పక్క తల్లి, అతిరిక్తమైన, గుడ్డి ప్రేమాభిమానాలు. ఈ రెంటిటి వల్ల, భూపతి, సాధారణంగా పిల్లలు పెరిగినట్టుగా, సహజమైన వాతావరణంలో పెరగలేదు. అతని ప్రవర్తనలో, ఒకవిధమైన దుర్బలత్వం నుంచి వచ్చిన విద్రోహ ప్రకృతి కనిపిస్తుంది. కాని ఇలా అని సరిపెట్టుకున్నా, అతడి వింత ప్రవర్తన ఎంత మాత్రం అర్థంకాదు.

వినతి పెళ్లయిన తరువాత రెండు మూడేళ్లకి, అత్తగారు చనిపోయింది. అంతకు ముందు సంగతి తెలియదుగాని, జీవితంలో ఆఖరి రెండు మూడేళ్లు ఆమె మనసు గాయపడి, చాలా కష్టం అనుభవించింది. ఆ కష్టానికి కారణం వినతి మాత్రం కాదు.

అత్తాకోడళ్ల మధ్యవున్న చిన్న చిన్న గొడవలు, వాటంతట అవే సర్దుకుపోను. అత్తగారికి వినతి అంటే ఎకువ ప్రేమ లేకపోయినా, ద్వేషం మాత్రం లేదు. వినతికి కూడా అత్తగారంటే పెద్దగా అభిమానం లేకపోయినా, ఆమె పట్ల గౌరవం వుంది. ఆమె చెప్పినట్టుగా నడుచుకోడం తన కర్తవ్యం అని తెలుసు. కాని మధ్యలో భూపతి కలుగ జేసుకుని, అంతా గందరగోళం చేసేసేవాడు.

వంట ఇంట్లో వినతి ఏదో చిన్న తప్పుపని చేసి అత్తగారి చేత చీవాట్లుతింది. పెద్దగొడవ ఏం కాదు. ఆ సంగతి భర్తకి చెబుదామని వినతి మనసులో కూడా అనుకోలేదు.

ఆరోజు ఆఫీసుకి వెళ్లేముందు భోజనం చేస్తూచేస్తూ, భూపతి హఠాత్తుగా, "ఇంకొక పనిమనిషిని పెట్టుకుంటేగాని, జరిగేటట్టు లేదు. ఏమంటావు, అమ్మా?" అన్నాడు.

భూపతి అన్నం తినేటప్పుడు, తల్లి ప్రతిపూటా, అతని పక్కనేకూర్చుని, విసన కర్రతో విసురుతూ వుండేది. అతడు అలా అనగానే, విసనకర్ర పక్కని పెట్టి, ఆశ్చర్యపోయి, "ఎందుకూ? మనికి పనిమనిషి అవసరం లేదే?" అంది.

భూపతి కొంచెంసేపు ఏం మాట్లాడలేదు. నిశ్శబ్దంగా అన్నం తింటూ తింటూ మళ్లీ, "ఒకర్తి.తోటే జరిగిపోతున్నదా?" అన్నాడు.

ఆమాట అతడి తల్లికి సరిగా అర్థం కాకపోయినా అతడు సూచించినదేమిటో కొద్దిగా బోధపడి; నోటమాటరాక కూర్చుండి పోయింది.

భూపతి మళ్లీ, "లేకపోతే, ఇంకో పెళ్లి చేసుకుంటాను. అలా ఎంతమంది చేసుకోడం లేదు?" అన్నాడు.

తల్లి చేతిలో విసురుతున్న విసన కర్ర ఆగిపోయింది. దుఃఖంతో, క్షోభతో ఆమె కళ్లల్లో నీళ్లు తిరిగేయి.

భూపతి అంతటితో ఆగిపోలేదు. "ఈ కాలంలో మగపిల్లలు తల్లికి తగిన గౌరవం చూపించడం లేదు. మాతృ భక్తితో, భార్యని త్యాగం చేస్తే కీర్తి వస్తుంది." అన్నాడు.

తల్లి ఏడుపు గొంతుతో, "నేను కోడలిని ఏమీ అనలేదు నాయనా! సంసారం దిద్దుకోడానికి కొన్ని విషయాలు నేర్పించాలి. అలా చెప్పేనని, కోడలికి కోపం వస్తే, నేను చెప్పనే చెప్పను." అంది.

వినతి సిగ్గుతో కుంచించుకు పోయి, భూమిలోకి కూరుకుపోతే బాగుండును అని అనుకుంది. తను భర్తతో ఫిర్యాదు చేసిందని అత్తగారు తప్పక అనుకుంటున్నాది.

ఆరాత్రి గదిలో ఏకాంతంగా వున్నప్పుడు భర్తతో వినతి చాలా కోపంగా, "ఛీ! ఛీ! అత్తగారితో అలా ఎందుకన్నారు? నేను మీతో ఏదైనా చెప్పేనా?" అంది.

భూపతి నవ్వుతూ, "ఇంకోపెళ్లి చేసుకో మని నువ్వు నాతో అనలేదనుకో" అన్నాడు.

"మీరు ఎంతకైనా తగుదురు!" అన్న మాటలు వినతి నోట్లోనుంచి అనుకోకుండా వచ్చేసేయి.

భూపతి అలాగే నవ్వుతూ, "నా శక్తి మీద నీకు అగాధమైన విశ్వాసం వున్నందుకు చాలా సంతోషం" అన్నాడు.

ఆ తరువాత ఈ విషయం గురించి మాట్లాడ్డం నిరర్థకం అని వినతికి అర్థమయింది.

కాని, వాళ్ల సంసారంలో ఇలాంటి సంఘటనేలు ఎన్నో. ఇదొక్కటేకాదు.

సాఫీగా, పొందికగా జరిగి పోవలసిన సంసార రథాన్ని విరగ్గొట్టి ముక్కముక్కలు చేసి వికృతంగా చేసెయ్యడంలో, భూపతి ఒక విధమైన అహేతుకమైన ఆనందాన్ని అనుభవించేవాడు. అంతకంటె ఎక్కువ - చిన్న చిన్న విషయాల్లో అతి కఠినంగా, రాతి గుండెతో ప్రవర్తించటం - అదీ అతనికి చాలా ఆనందాన్నిచ్చేది.

భూపతి పెళ్లికి ముందు, ఇంటికి కావలసిన సామానులు, తల్లే కొంటూవుండేది. ఆమె చేతికే డబ్బు ఇచ్చేవాడు. కాని పెళ్లయిన తర్వాత నెలలో మొదటివారం గడిచిపోయినా భూపతి డబ్బు ఇవ్వకపోడం వల్ల, ఆమె ఒక రోజు, భూపతితో, "చేతిలో ఇంక డబ్బు లేదురా, ఈ సారి జీతాలు అందడం ఇంత ఆలస్యందేనికి?" అంది.

భూపతి న్యూసుపేపరు చూస్తున్నాడు. అది చూస్తూనే, "ఆలస్యం ఎక్కడయింది?" అన్నాడు.

"ఇవ్వాల్టికి వారం, ఆలస్యం కాదా?"

"జీతం ఎప్పుడో అందింది. ఓ, నీకు ఇంటి ఖర్చుకి ఇంకా ఇవ్వలేదు కాబోలు. సరే, ఇస్తాలే"?

నెల సామానులు తెప్పించాలి. నాకు ఈ రోజే అవసరం".

భూపతి అలాగే న్యూసుపేపరు చూస్తూ, "దాని చేతికిస్తాను నీకెంత కావాలో, తన దగ్గరనుంచి అడిగి తీసుకో" అన్నాడు.

తల్లి మనసు గాయ పరచడానికి, ఆ మాటలు చాలు. ఆమె మనసు పూర్తిగా గాయపడింది. అక్కడి నుంచి వెళ్లిపోడానికి వెనక్కి తిరిగింది. నిర్వికారమైన కఠినత్వం, ఎలాగో అర్థం చేసుకోవచ్చు. కాని భూపతి అంతటితో వూరుకోలేదు. పత్రిక పక్కన పెట్టి, "కోడలి దగ్గర చెయ్యి జాపి అడగడానికి పరువు తక్కువ కాదు కదా!" అన్నాడు.

తల్లి ఇంక సహించ లేకపోయింది. సహించడం, సాధ్యం కూడా కాదేమో, గబుక్కుని అతని వేపు తిరిగి, కన్నీళ్లు ఆపుకుంటూ, బొంగురు గొంతుతో, మనసులో వున్న బాధనీ క్షోభనీ వెళ్లగక్కుతూ, నాలుగు మాటలూ అనేసింది. "తల్లి అంటే గౌరవం లేకపోవచ్చు, కాని పాతికేళ్ల నుంచీ, అన్ని కష్టాలూ భరించి, పెంచి పెద్దవాడిని చేసినందుకు ప్రతిఫలం ఇదేకాబోలు!" అంది.

అయినా భూపతి ఏమీచలించకుండా నవ్వుతూ, "కోడలి మీద పెత్తనం చెలాయిద్దామనే ఆశతోటే కాబోలు, అంతకష్టపడి నన్ను పెంచి పెద్దవాడిని చేసేవు" అన్నాడు.

ఈ మాటకి తల్లి ఏం జవాబు చెప్పాలో తెలియక, మాటలు ఎతుక్కోవలసి వచ్చింది. ఆ రోజు నుంచి ఆమె, కొడుకు సంసారం నుంచి పూర్తిగా దూరంగా జరిగిపోయింది. వినతి చెయ్యగలిగిందేమీ లేకపోయింది. ఆమె కూడా దోషి అని అత్తగారు అనుకోడం సహజం. అత్తగారిని సంతోషపెట్టడానికి, వినతి చేసిన చిన్న చిన్న ప్రయత్నాల్ని, ఆమె అపార్థం చేసుకుంది. ఆఖరికి లాభం లేదని, వినతి ఆప్రయత్నాలు మానుకుంది.

అప్పటినుంచి వినతికి భర్తంటే ఇంకా భయం ఎక్కువైంది. భర్త ప్రవర్తన ఆమెకి ఏమీ అంతుపట్టలేదు. అలా సంసారం ఖర్చుకి సరిపోయే డబ్బు తన చేతికివ్వడం, తన మీద గాఢమైన ప్రేమ వల్ల మాత్రం కాదని వినతికి బాగా తెలుసు. అయితే, ఈ వింతైన హృదయహీనత్వానికి మూలం ఏమిటి.

వినతికి అర్థంకాదు. అందుచేత, ఆమె మనసులో అగాధమైన అర్థంలేని భయం చోటు చేసుకుంది. భర్త ఎదురుగా వున్నప్పుడు, ఏదో చెప్పలేని, అస్పష్టమైన భీతాహం ఆమెని ఆవరిస్తూ వుండేది.

అత్తగారు చనిపోయిన తరువాత ఆ భయం ఇంకా ఎక్కువైంది. ఈ ప్రపంచంలో ఆమెకి ఇంకెవ్వరూ లేరు. అటువంటి సమయంలో, భర్త దగ్గర తన మనసు విప్పి మాట్లాడగలిగివుంటే, భర్తకి సన్నిహితురాలు కాగలిగి వుండేది, వినతికి జీవితం మధురంగా గడిచిపోయి వుండును. కాని, ఆమె మనసు విప్పి మాట్లాడటం మాట దేవుడెరుగును, ఆ భార్యాభర్తల మధ్య సంబంధం ఇంకా చైతన్య రహితంగా అయిపోతూ వచ్చింది; వాళ్ల మధ్య ఒక కనపడని గోడ ఎవరో కడుతున్నట్టు అయింది. మార్పులేకుండా రోజుల తరబడి అలా కలిసి వుండడం వల్ల కాబోలు, వినతిలో ఒక వింతైన మార్పు కనిపించింది. అతి భయస్థురాలు, సరళ స్వభావి అయిన ఆ పాత వినతి ఎప్పుడో మాయమైంది. వినతి స్వభావం క్రమంగా మొరటుగా మారిపోయింది. ఆమెకి ఇంటి పనులలో కూడా సోమరితనం, ఉత్సాహం లేకపోవడం కనిపించేయి. సంసారంలో చెయ్యవలసిన పనులన్నీ చేసినా, వాటి మీద ఏ విధమైన శ్రద్ధ లేనట్టుగా కనిపించేది. తన శరీరం గురించి కూడా ఆమెకి ఒక విధమైన ఉదాసీనత వచ్చేసింది. ఆమెకి భవిష్యత్తు అంధకారం. నిర్లప్తతతో, ఎలాగోలాగ రోజులు గడిచి పోతే చాలుననుకునేది.

రాత్రిపూట ఆమెకి నిద్ర పట్టేదికాదు. నిద్రలో కూడా ఉలికి పడుతూ ప్రతి క్షణం మెలకువగా వుండేది.


కాని, వాళ్ల జీవితాలని ఆవరిస్తున్నా, ఆ భయావహమైన నీడకి నిజంగా భూపతేనా కారణం? భూపతిలో, ఈ ఉదాసీనతతో కూడిన పాషాణ హృదయమే కాక ఇంకేమైనా వుందా?

ఏమీ బోధ పడదు. పై నుంచి చూస్తే అతనిలో, ఏవిధమైన మార్పు రాలేదు. వాళ్ల మధ్య కనిపించని గోడ వున్న భావం, వినతికే ఎప్పుడూ అనిపిస్తూ వుంటుంది. భూపతికి అలా అనిపించనే అనిపించదు.

ఎప్పుడూ ఎలావుండేవాడో, భూపతి ఇప్పుడూ అలాగే వున్నాడు. వినతి పట్ల నృశంగా, చెడుగా ప్రవర్తించలేదు. ఆమెనెప్పుడూ ఆజ్ఞాపించడు. ఆమె స్వతంత్రంగా, తన ఇష్టం వచ్చినట్టు సంసారం దిద్దుకుంటే, దానికేవిధంగానూ అడ్డు పెట్టడు.

భార్యతో అతను మాట్లాడే తీరు సహజంగానే కనిపిస్తుంది. అతడి కంఠస్వరం కూడా సరళంగా వుంటుంది.

ఒకరోజు వినతితో, "నీ జుట్టు వూడిపోతున్నది" అన్నాడు. వినతి చాకలి తెచ్చిన మడత బట్టలు ట్రంకులో పెడుతోంది. ఏం జవాబివ్వలేదు.



భూపతి తిరిగి, "అదృష్టం కొద్దీ నీ నుదురు చిన్నది. పెద్ద నుదురున్న ఆడువాళ్లకి జుట్టూడి పోతే చాలా అసహ్యంగా కనిపిస్తారు." అన్నాడు.

వినతి విసురుగా, కఠినస్వరంతో, "నాను దుటి కర్మఎలాగో కాలిపోయింది జుట్టూడినా కనిపించదు." అంది.

"నువ్వు అద్దంలో చూసుకున్నావా?"

"అద్దంలో చూసుకోవలసిన అవసరం లేదు. నాకు తెలుసు"

"అయినా, జుట్టుంటే, ముదనష్టపు నుదురు కొంచెం కప్పివుంటుంది. రేపే ఏదైనా మంచి తలనూనె తీసుకు రావాలి."

వినతి బట్టన్నీ పెట్టెలో సర్దేసి, ట్రంకు మూసి, "నాకేం అవసరం లేదు నా జుట్టూడి పోతే నష్టం ఏంలేదు." అంది.

"కొంచెం నష్టం వుందిలే. జుట్టూడిపోతే, పాపిట్లో సిందూరం సరిగ్గా పెట్టుకోడం అవదు. ఏమంటావు?" అన్నాడు.

వినతి ఏం మాట్లాడలేదు.

భూపతి మళ్లీ, "రేపే ఒక తలనూనె సీసా తెస్తాను.

ఆ మర్నాడు భూపతి నిజంగానే ఒక తలనూనె సీసా తెచ్చి, "ఇంద, రోజూ సరిగ్గా రాసుకో" అన్నాడు.

అతడు తెచ్చిన సీసా చాలా చిన్నది. అది చూసి వినతి, "ఇంత చిన్న సీసా! ఒక్క సారి రాసుకుంటేనే అయిపోతుందే!" అంది.

భూపతి చిన్నగా నవ్వి, "అది తలనూనె కాదు. నుదుటిపైన జుట్టూడిన చోట రాసుకోడానికి. దాని మీద రాసి వుంది. చదివి చూడు - కాలిన చర్మానికి శ్రేష్ఠమైన మందు - అని రాసి వుంది."

సిగ్గు, వినయంతో అతినమ్రంగా వుండే ఆ పాత వినతి అయితే ఏంచేసి వుండునో, కాని ఇప్పటి వినతి, తనని తను అదుపులో పెట్టుకోలేకపోయింది. కోపం పట్టలేక, ఆ సీసాని జోరుగా విసిరి కొట్టింది.

టేబిలు మీద పడిన విరిగిన సీసా ముక్కలు, ఒలిగిన నూనె వేపు చూసి భూపతి, "నీ చేతికి బొత్తిగా అదుపు వున్నట్టు లేదే!" అని మాత్రం అన్నాడు. అతని గొంతులో కొంచెంకూడా ఆశ్చర్యం కాని, ఉద్రేకంగాని లేవు.

ఆ భార్యాభర్తల మధ్య సంభాషణ అదోమాదిరిగా వుంటుంది. భూపతి ఒకరోజు ఉదయం న్యూసుపేపరు చదువుతూ, "ఇదిగో, ఇలారా! అన్నాడు.

వినతి ఏదో పని మీద స్టోరు రూము వేపు వెడుతూ, "ఎందుకూ?" అంది.

"నేను చెప్పేది వినకూడదా?"

వినతి దగ్గరకి వచ్చింది. పేపరులో ఒక చోట చూపించి, "చదువు చాలా గమ్మత్తైన సంగతి." అన్నాడు భూపతి.

"నాకు ఇప్పుడే తీరిక లేదు," అని వినతి వెళ్లిపోబోతూ వుంటే, గబుక్కుని ఆమెపైట కొంగు పట్టుకుని, "ఏం ఫరవాలేదు. ఈ కొంచెం చదవడానికి ఎంతటైము కావాలి." అన్నాడు.

మరితప్పదని, వినతి పేపరు చేతిలోకి తీసుకుంది. కాని అతడు చూపించినది చదువుతూ వుంటే, ఆమె ముఖం నల్లగా అయిపోయింది. నిశ్శబ్దంగా పేపరు అతని ఒడిలో పడేసి, వెళ్లిపోతూవుంటే, ఆమె చెయ్యి పట్టుకుని, "చాలా తమాషాగా వుంది కదూ? ' అన్నాడు.

వినతి భర్త ముఖంలోకి తీవ్రంగా చూసి, గంభీరంగా వెళ్లిపోతూ, 'హుం" అని మాత్రం అంది.

"ఈ ప్రపంచంలో ఎవ్వరినీ నమ్మలేం. ఏదీ ఆశ్చర్యంకాదు. ఏమంటావు?" అన్నాడు.

"అవును" అని వినతి విసురుగా తన చేతిని విడిపించుకుని, అక్కడి నుంచి వెళ్లిపోయింది.

భూపతి అప్పుడింక ఏం మాట్లాడలేదు. కాని భోజనం టైములో, అన్నం ఒక ముద్ద నోట్లో పెట్టుకో బోయి, చెయ్యి దింపేసి, "ఇలాగే నిశ్చింతగా, నమ్మకంతో, ఆ మనిషి కూడా నోట్లో ముద్దపెట్టుకున్నాడు. రోజంతా కష్టపడి, హైరాన పడి, ఆకలితో ఇంటికి వచ్చి రెండు ముద్దలు తిన్నాడు. అంతే! చుట్టూ చీకటిగా అయిపోయింది. పాపం! అతనికేం తెలుసు? అతని జీవితంలో మరి వెలుగు చూడడనీ, అదే అతని జీవితంలో తిన్న ఆఖరి ముద్ద అని అతనికేం తెలుసు?" అన్నాడు.

వినతి కొద్దిగా వణికింది. భూపతి ఆమె వేపుఒకసారి చూసి, "అప్పుడు అతని భార్య ఎదురుగా కూర్చుని వుండే వుంటుంది. భర్తకోసం చాలా శ్రమపడి, శ్రద్ధగా అటువంటి భోజనం తయారు చేసింది - అది అతని ఆకలి తీర్చేది మాత్రమే కాదు, జీవితంలో మరి ఆకలి వెయ్యకుండా అయిపోతుంది - భర్త అప్పుడు భోజనం ఎలా చేస్తాడో, నోట్లో ముద్ద ఎలా పెట్టుకుంటాడో చూడాలి కదా! ' అన్నాడు.


భూపతి ముఖంలో కొద్దిగా నవ్వు కనిపించింది. మళ్లీ అతడు, "అతడి భార్య, ఆసక్తితో అతడి ఎదురుగా కూర్చోడం నాకళ్లకి కట్టినట్టుగా వుంది. ఆ విధంగా, ఎన్నోరోజులు, మధ్యాహ్నం, రాత్రి, భర్త భోజనం చేసేటప్పుడు అతనికెదురుగా, కూర్చునే వుండి వుంటుంది. బహుశ, ఆ రోజు వున్నంత ఆసక్తితోకాదు.' అన్నాడు.

వినతి హఠాత్తుగా లేచి అక్కడినుంచి వెళ్లి పోయింది.

☆ ☆ ☆

కాని భూపతిలో కూడా కొద్దిగా మార్పు కనిపిస్తున్నది. వినతి అడగకపోయినా, తనంతట తనే, ఒక రోజు పని మనిషిని కుదిర్చేడు. ఇంకో రోజు ఆఫీసు నుంచి వస్తూ, వస్తూ రెండు, మూడు పువ్వుల చీటీ గుడ్డలు కొని తెచ్చి, వినతితో, "చవుకగా దొరికేయని కొన్నాను, పన్నా తక్కువ, చేతులు లేని జాకెట్లు అవొచ్చు." అన్నాడు.

వినతి గర్భవతి అయింది. ఆమె చాలా దుర్బలంగా వుంది. ఒంట్లో రక్తం లేదు. కాళ్లూ,



చేతులూ సన్నంగా అయిపోయేయి.

బిడ్డ పుడుతుందని సంతోషంగా వున్నా, ఉత్సాహం లేదు. ఇంక ఏ విషయంలోనూ కూడా ఆమెకి ఉత్సాహం లేదు. అది, బహుశ ఆమె అలసి పోయని శరీరం వల్ల నేమో. లేక, బహుశ, అంతకంటె ఎక్కువగా తన పుట్టబోయే బిడ్డని సంబంధించిన భయం వల్లనేమో! భూపతి నీడలు, ఆ బిడ్డలో కూడా కనిపిస్తే! ఇలాగే తెలియని భయంకరమైన దూరం, తనకీ, బిడ్డకీ మధ్య కూడా సృష్టి అయితే! మాతృత్వం పొంది కూడా, బిడ్డని తన స్వంతం చేసుకోలేకపోతే వినతికి ఆలోచించడం కూడా ఇష్టం వుండదు. భవిష్యత్తు గురించి ఉదాసీనతగా వుండానికి, ప్రయత్నిస్తుంది.

భూపతి కళ్లల్లో, ముఖంలో ఒక విధమైన వెలుగు కనిపిస్తోంది. ఒక రోజు హఠాత్తుగా, "ఈ వక్కవెయ్యడానికింత ఆయాస పడుతున్నావెందుకు?" అని అడిగేడు వినతిని.

వినతి జవాబు చెప్పలేదు. ఆమె నిజంగా ఎంతో అలసటగా, ఎంతో నీరసంగా వున్నట్టు కనిపిస్తోంది. ఏదో విధంగా, మరో బలంతో, నిలదొక్కుకుని, పనులు చేసుకుపోతున్నది. కాని ఆమె శరీరం తట్టుకోలేకపోతున్నది. ఒకసారి పడుకుంటే, మరిలేవబుద్ధికాదు. గాఢంగా నిద్ర, మృత్యువులా, వచ్చినా, ఆమెకి పోయేదం లేదు.

భూపతి బిడ్డ ఆమెని శతృత్వంతో ఇప్పటి నుంచే సాధించడం మొదలు పెట్టినట్టుగా వుంది. ఆమెలోని ప్రాణ శక్తినంతటినీ నిర్దయగా పీల్చేస్తోంది.

భూపతి ఒక రోజు తనంతట తనే డాక్టరుని పిలుచుక వచ్చేడు. వినతికి డాక్టరుకి చూపించుకోవాలని లేదు. కాని అభ్యంతరం చెప్పలేక పోయింది. డాక్టరు పరీక్ష చేసి, మందులు రాసిచ్చి, జాగ్రత్తగా వుండమని ఎన్నో సలహాలిచ్చి వెళ్లి పోయేడు.

భూపతి డాక్టర్ని, 'ప్రాణభయంలేదు కదా?' అని అడిగితే, 'భయమా? కొద్దిగా వుందనుకోండి! అన్నాడు.

డాక్టరు వెళ్లి పోయిన తరువాత వినతి అదోవిధంగా నవ్వి, "డాక్టర్ని ఎందుకు పిలిచేరు? నేను చచ్చిపోను, భయంలేదు" అంది.

భూపతి జవాబుగా, "చెప్పలేం,నువ్వు ఇప్పుడు ఏదైనా చెయ్యగలవు" అన్నాడు.

★ ★ ★

వినతి చచ్చిపోలేదు, కాని మృత్యు ముఖంలోకి వెళ్లి, మృత శిశువుని కని, బయట పడింది.

ఏ ప్రమాదం లేకుండా, క్షేమంగా ప్రసవం అవడానికి, భూపతి భార్యని హాస్పటల్లో చేర్పించేడు.

చనిపోయిన శిశువుని కన్న తరువాత, కొద్దిసేపు, వినతి పరిస్థితి, ఆమె ప్రాణాలకే ముప్పు కలిగేటట్టుగా వుంది. ఆ గండం గడిచి, ఆమెకి కొంచెం బాగున్నాక, భూపతికి లోపలికి వెళ్లడానికి, అనుమతి దొరికింది. అక్కడి డాక్టరు, భూపతితో, "మీ అదృష్టం బాగుంది. శిశువుని ముక్క ముక్కలు చేసి టైముకి బయిటికి పడెయ్యకపోతే, మీ భార్య ప్రాణం రక్షించడం అయేదికాదు.

భూపతి డాక్టరు వేపు అదోలా చూసి, "మీకు నా ధన్యవాదాలు" అన్నాడు.

డాక్టరు కొంచెం ఇబ్బందిగా, "అబ్బే! ధన్యవాదాలుదేనికి? అది మా కర్తవ్యం" అన్నాడు.

"ఎంత మంది డాక్టర్లు వాళ్ల కర్తవ్యం అని చేస్తున్నారులెండి?" అని భూపతి కొద్దిగా నవ్వేడు.

వినతి పడుకుని వున్న గదిలోకి వెళ్లినప్పుడు కూడా, ఆ నవ్వు ముఖంతోటే వెళ్లేడు. తెల్లటి పడక మీద పాలిపోయిన ఆమె శరీరం కలిసిపోయినట్టుగా వుంది. మెడ వరకు తెల్లటి దుప్పటి కప్పివుంది. నీరసంగా వున్న ఆమె ముఖం కూడా దుప్పటి లాగే, తెల్లగా వుంది.

భూపతి వెళ్లి, ఆమె మంచం పక్క నిలబడినప్పుడు, ఆమె కళ్లల్లో కనిపించిన భావానికి అర్థం ఆ భగవంతుడికి కూడా తెలియదు. దానిని భయం అనైనా అనవచ్చు కాని దాంట్లో అహంకారంతో కూడిన తృణీకార భావం స్ఫురిస్తోంది. మృత్యుద్వారం నుంచి వినతి ఇదా కూడగట్టుకు వచ్చింది?

భూపతి పక్కనే వున్న కుర్చీలో కూర్చులేదు. కొద్ది సేపు ఏం మాట్లాడకుండా నిలబడి, "నేను వెళ్లాలి" అన్నాడు.

"అదే అనుకుంటున్నాను-" వినతి కంఠస్వరం - గొణిగినట్టుగా వున్నా దాంట్లో, అసాధరణమైన తీవ్రతవుంది.

హాస్లటలు నుంచి వినతిని త్వరగా పంపెయ్యడానికి డాక్టర్లు ఒప్పుకోలేదు. ప్రమాద పరిస్థితి దాటితేగాని, ఆమెని ఇంటికి పంపమని డాక్టర్లు అన్నారు. కాని భూపతి మొండిగా, వాళ్లు చెప్పిన టైము అవతముందే, ఎన్నో విధాల ప్రయత్నించి, ఇంటికి తీసుకుని వెళ్లిపోయేడు.

ఆ వార్డు డాక్టరు, "మీరు చాలా పొరపాటు చేస్తున్నారు. ప్రేమఅభిమానం గొప్పవే. కాని, జబ్బు, హాస్పటల్లో, ఈ హృదయం లేని, యాత్రికంగా జరిగే సేవలతోటే తగ్గుతుంది. ఇంకొంచెం రోజులు వుంచితే, ప్రాణభయం వుండకపోను". అన్నాడు.

భూపతి వ్యంగ్యంగా, "మీ మాటలన్నీ నమ్మగలిస్తే, బాగుండేది" అన్నాడు.

కాని ఇంటికి వెళ్లిన తరువాత, ఆశ్చర్యకరంగా, వినతి రోజురోజుకీ కోలుకుని, ఆరోగ్యంగా, బలంగా తయారైంది. మృత్యువుని ఆ విధంగా తృణీకరించ గలిగే శక్తి, ఆమెకి ఎక్కడి నుంచి వచ్చిందో ఎవరికి తెలుసు? ఆమె కళ్లల్లో కనపడే తీక్షమైన తిరస్కార భావం, ఈ మధ్య దురహంకారంగా మారింది. అదే, ఆమెకు కొత్తగా లభ్యమైన రహస్య శక్తిని సూచిస్తున్నదా?

భార్యా, భర్తలు కొద్ది రోజులై బొత్తిగా మాట్లాడుకోడం మానేసేరు. ఒకరోజు భూపతి ఆఫీసు నుంచి వచ్చి, బట్టలు మార్చుకోకుండా,



''తొందరగా తయారవు. ఇవ్వుడే బయలుదేరాలి'' అన్నాడు.

అతి సహజమైన ఉత్తరువు. గడిచినరెండు సంవత్సరాలలో, భర్తతో హాస్పటలుకి తప్ప ఇంకెక్కిడికి వెళ్లినట్టు గుర్తులేదు, వినతికి.

వినతి దెప్పుతున్న స్వరంతో "ఎక్కడికి?' ' అంది.

"సినీమా చూడ్డానికి. రెండు పాసులు సంపాదించేను. డబ్బు ఖర్చు పెట్టి వెళ్లడం అవనే అవదు. పద, చూసి వద్దాం." అన్నాడు.

"మీరు వెళ్లి చూడండి" అని వినతి అతడినుంచి వెళ్లి పోబోయింది.

భూపతి ద్వారాని కడ్డుగా నిలబడి, "ఏం? నువ్వెందుకు రావు? నాతో రావడానికి భయమా?" అన్నాడు.

వినతి కొంచెం నవ్వింది. ఈ మధ్య ఆమె నవ్వుతోంది. "ఇన్నిరోజులై ఇంట్లో మీతో గడుపుతున్నాను, ఇంక బయటికి వెళ్లడానికి భయందేనికి?" అంది.

భూపతి ఆమె వేపు నిశితంగా చూడ్డానికి, ప్రయత్నించి, "అయితే రాకూడదూ?" అన్నాడు.

"సరే, పదండి" అంది వినతి.

ఒకట్రాము మారి ఇంకో ట్రాము ఎక్కుతూ వుంటే, వినతి, "దగ్గరలో సినీమా హాళ్లు లేవా?" అని అడిగింది.

"వున్నాయి. కాని టికెట్టు కొనకుండా చూడ్డానికి పాసు లేదు" అన్నాడు.

వాళ్లు వెళ్లిన సినీమా హాలు పట్నానికి ఒక చివర వుంది. అక్కడికి చేరిన తరువాత, భూపతి, భార్యని ఆడవాళ్ల వేపు కూర్చోమన్నాడు. వినతి ఒకసారి, ''ఒకే దగ్గర ఇద్దరం కూర్చుంటే ఏమయింది?"

"లేదు, మగవాళ్ల వైపు ఎక్కువ. నీకు కష్టం అవుతుంది." వినతి అదోరకంగా నవ్వి, ఆడ వాళ్లు కూర్చునే వైపుకి నడిచింది.

భూపతి ఆ తరువాత ఏం చేసునో చెప్పలేము. కాని ఇంతలో ఒక స్నేహితుడు కనిపించేడు. అతడు నవ్వి, "నీకు సరదా ఎక్కువగానే వుందే! ఇంత దూరం భార్యని సినీమా చూపించడానికి తీసుకుని వచ్చేవు!' ' అన్నాడు.

"కష్టపడి ఇంతదూరం రావడంలో సరదా ఎక్కడ?" అని, భూపతి హాలులో మగవాళ్లవైపు వెళ్లి కూర్చున్నాడు. స్నేహితుడు కూడా పక్క సీట్లో కూర్చున్నాడు. అతడు, భూపతిని ఒకసారి గిల్లి, "అలా మరీ అన్ని సార్లు అటువేపు చూడకు. నీ భార్య పారిపోదులే!" అన్నాడు.

భూపతి కొంచెం ముడుచుకుపోయి, "లేదు, లేదు! ఆమెకి చాలా సిగ్గు. సరిగ్గా కూర్చోడానికి జాగా దొరికిందో లేదోనని చూస్తున్నాను." అన్నాడు.

సినీమా మొదలయిన కొంతసేపటికే, కుదురుగా కూర్చోలేక, అటూ ఇటూ కదులుతూ, భూపతి హఠాత్తుగా లేచిపోయేడు.

"మళ్లీ ఏమైంది?" అన్నాడు స్నేహితుడు.

"ఏం లేదు. ఇప్పుడే వస్తాను." అంటూ లేచేడు భూపతి. స్నేహితుడు నవ్వి, "బోధపడింది. ఇలా సినీమా చూపించక పోతేనేం? ఇంట్లో వుంచి, తాళం వేసి వచ్చేస్తే సరిపోను" అన్నాడు.

భూపతి ఇంకేం మాట్లాడలేదు. త్వరగా హాలులోనుంచి బయటికి వచ్చి, రోడు పక్కనే వున్న టాక్సీలో తిన్నగా వెళ్లి కూర్చుని, ఎటు వెళ్లాలో చెప్పేడు.

డ్రయివరు టాక్సీ స్టార్టు చేసేడు. కాని బండిని ముందుకి నడవకపోడం చూసి, భూపతికి కొద్దిగా చికాకు వేసి ఏదో అనబోయేడు. కాని అనలేకపోయేడు, డ్రయివరు చూస్తున్నవేపే చూసి. నవ్వుముఖంతో తలుపుతీసి, "రా, సరిగ్గా సమయానికి వచ్చేసేవు" అన్నాడు, వినతితో

వినతి టాక్సీలో కూర్చుని, "అవును మీరు బయటికి రావడం చూసేను." అంది.

"నువ్వు నన్ను గమనించేవు కాబోలు"

"అవును, గమనించేను."

కొన్ని నిముషాలు వాళ్లు మరేం మాట్లాడుకోలేదు. వినతి హఠాత్తుగా, "మీరు ఇలాంటి తెలివి తక్కువ పని చేస్తారనుకోలేదు. మీరు హాలు బయటికి రావడం చూడక పోయినా, నాకేమీ పెద్ద నష్టం లేకపోను. నాకు ఇంటి ఎడ్రసు తెలుసు. టాక్సీవాడికి మీ పేరు కూడా చెప్పగలను. ఒక్కసారే ఇద్దరం ఇలాగ వెళ్లక పోయినా, నేను మరి కొంచెం సేపటికి ఇల్లు చేరుకుని వుండును. ఇవన్నీ మీరు ఆలోచించలేదు కాబోలు?" అంది.

లేదు. అన్నీ ఆలోచించేను. మనసులో నామీద వున్న అసహ్యంతో, నువ్వు తిరిగి ఇంటికి రావు అనుకున్నాను. అలా అనుకుని పొరపాటు చేసేను." అన్నాడు.

"మనసులో అసహ్యంతో మనుషులు ఏం చెయ్యగలరో పైవాళ్లకి తెలుస్తుందా?" అని మాత్రం అంది వినతి. ఆ తరువాత మరి మాట్లాడలేదు. టాక్సీలో కూర్చుని ఇద్దరూ నిశ్శబ్దంగా ఇల్లు చేరేరు. మృత్యువు లాంటి ఆ నిశ్శబ్దత, వాళ్ల దాంపత్య జీవితాన్ని అతిభారంగా చేసేసింది.

మామూలుగా వాళ్ల మధ్య, సంసారం గడవడానికి అవసరమైన మాటలు మాత్రం జరుగుతాయి. ఒక్కొక్కప్పుడు, అణుచుకోలేని ఉద్రేకంతో, ఒకరి మనసునొకరు గాయపరుచుకుంటారు. కాని, వాళ్ల సంసారాన్ని ఆవరించిన నిశ్శబ్దపు భారాన్ని తొలగించే అవకాశం లేదు. జీవితంలో ఒకే ఒక సుఖం పొందడం కోసం, ఈ నిశ్శబ్దపు బహిష్కరణని, వాళ్ల ఒంటరి ఆత్మలు, కావాలనే, స్వంతం చేసుకున్నాయి.

వాళ్లు బహుశ ఒకరి నొకరు విడిచిపెట్టి బ్రతకలేరేమో. వాళ్ల మధ్య ప్రేమలేదు. దానికంటె తీవ్రమైన, దానికంటె గంభీరమైన, ఉన్మాదమయమైన, ద్వేషం, అసహ్యం అనే సంకెళ్లతో వాళ్లు కట్టుబడి వున్నారు. ఆ సంకెళ్లు తెంచుకుంటే, వారికింక బ్రతికి వుండడానికి కారణంగాని, అవసరంగాని ఏముంటుంది? ఆ జీవితాలకింక ఆశ్రయం ఏదీ? ఒకరి నొకరు ద్వేషించుకుంటూ, ఒకరికోసం ఒకరు బ్రతికి వుండాలని కూడా వాళ్ల కోరిక.

●

